

విశాలాంధ్ర విశాఖపట్నం

పేజి నెం. 5

బుధవారం 21, ఆగస్టు, 2024

చిన్న మెట్టలో మైనింగ్‌కి అనుమతులు ఇవ్వొద్దు

కలెక్టర్‌కి సీపీఐ జిల్లా కార్యదర్శి మరపిల్ల విజ్ఞప్తి

విశాలాంధ్ర – విశాఖ: విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ గ్రామ సర్వే నెంబరు 104లో చిన్న మెట్ట (ఎద్దు మెట్ట)లో గ్రావెల్, రఫ్ స్టోన్, క్వార్ట్‌జైట్‌లను పెద్ద మిషన్లతో తవ్వి, భారీ వాహనాల్లో తరలించడం వల్ల చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న గొట్టుపిల్లి, పందలపాక, తర్లువాడ, ముకుందపురం, రేగివానిపాలెం, చిన్నపాలెం, రాణిపేట, బోని, చందక, చిన్నాపురం, జగ్గరాజుపాలెం, సీతంపేట, ఏనుగులపాలెం, తర్లువాడ గ్రామాలతో పాటు ఆనందపురం మండలంలో సుమారు 20 నుండి 30 గ్రామాలు పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని జిల్లా కలెక్టర్‌కి మెయిల్ ద్వారా సీపీఐ జిల్లా కార్యదర్శి మరిపిల్ల పైడిరాజు వినతి పత్రం పంపారు. దీనివల్ల పంట భూములు, సాగునీరు, తాగునీరు పూర్తిగా కలుషితం అవుతాయని, ప్రజల ఆరోగ్యం సర్వ నాశనం అవుతుందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలు విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఒకసారి మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇస్తే 20 ఏళ్ళ పాటు తవ్వకాలు కొనసాగుతాయని అన్నారు. పర్యావరణం విధ్వంసం అవుతుందని తెలిపారు. ప్రజలకు, రైతులకు నష్టం చేకూర్చే ఈ తవ్వకాల ప్రతిపాదనలు ఆపాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

పార్కులో పిచ్చి మొక్కలు పట్టించుకోని హైవే అధికారులు

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలో వేములవలస జంక్షన్‌లో నూతన బ్రిడ్జి నేషనల్ హైవే పార్క్ గత కొంతకాలం నుండి నిరుపయోగంగా పార్కులో పిచ్చి మొక్కలతో వాహనదారులకు దర్శనమిస్తుంది. అప్పట్లో కొన్ని మొక్కలు పార్కులో వేసి తర్వాత పనులు చేయకుండా పూర్తిగా గాలికి వదిలేశారు. అప్పటినుంచి చెత్తాచెదారంతో గడ్డి, పిచ్చి మొక్కలు పార్కు అంతా చిన్న జంగిల్‌లా ఏర్పడింది. మూల కేంద్రమైన హైవే పార్క్‌లో కొంతమేర మొక్కలు నాటి కొన్ని ఏర్పాటు చేయాలని, ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదకరంగా కొంతమేర సేదతీరే అవకాశాన్ని ఏర్పరచాలని, ఇప్పటికైనా హైవే అధికారులు దృష్టి సారించి పార్కును శుభ్రపరచాలని పలువురు కోరుతున్నారు.

పుట్టగొడుగుల్లా నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర – సింహాచలం: గ్రేటర్ విశాఖ జోన్ 8 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. జీవీఎంసీ జోన్ 8 పరిధిలో ఉన్న సింహాచలం పరిసర ప్రాంతాలు, గోపాలపట్నం పరిసర ప్రాంతాలు అయిన సుసర్ల కాలని ఎన్.ఎ.డి ఆసుపత్రి సమీపంలో, గోపాలపట్నం ఎల్.జి షోరూమ్ ప్రక్కన, కొత్తపాలెం పరిధిలో అనధికార నిర్మాణాలు జోరు పెరిగింది. వీటిని నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడం వెనుక పలు ఆరోపణలు వార్డులో వినిపిస్తున్నాయి. ప్రధానంగా టీపీఓ వ్యవహార శైలిపై స్థానికంగా ఆరోపణలు నిత్యం ఏదో పత్రికలు వార్తలు వస్తున్న ఆయనపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికులు పలుమార్లు ఏసీబీ స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న వారి నుంచి సరైన చర్యలు లేకపోవడంపై స్థానికుల అనుమానాలకు మరింత బలం చేకూరింది. ఫలానా ప్రదేశంలో అనధికార నిర్మాణం అని తెలిసిన వాటి జోలికి రావడంలేదని పరిస్థితిని బట్టి అర్థమ వుతుంది. జో 8 టౌన్ ప్లానింగ్ తీరుపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తపాలెంలో నిర్మిస్తున్న భవనం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా సాగుతుంది. సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న భవనానికి అనుమతులే లేవని తెలిసింది. స్థానిక సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ భవన నిర్మాణం జరుగుతున్నట్లుగా స్థానికులు పేర్కొన్నారు. టీపీఓ వ్యవహార శైలిపై దర్యాప్తు చేయాలని అదేవిధంగా నిర్మాణంలో ఉన్న

భవనంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

విశాలాంధ్ర – ఆనందపురం: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పి.అనిల్ కుమార్ తెలిపారు. ఆనందపురం గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం గ్రామంలో సుమారు 340 పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు టీకాలు వేసుకోవటం వలన పాలు దిగుబడి తగ్గుతుందనే రైతులలో అపోహ మాత్రమే అని అది ఎంత మాత్రం నిజం కాదని పేర్కొన్నారు. రైతులందరూ ఈ టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

24న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: ఈ నెల 24వ తేదీన ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలను నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.పోలినాయుడు తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఆగస్టు 24న ఉదయం ఉదయం 10.00 గం.లకు రెండు, ఐదవ స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని అన్నారు. ఉదయం 11.00 గం.లకు నాలుగు, మూడవ స్థాయీ సంఘ సమావేశాలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.00 గం.లకు ఆరు, ఏడు మరియు 1వ స్థాయీ సంఘాల సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులందరూ హాజరు కావలసిందిగా ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఎన్.ఎస్.టి.ఎల్ డి.ఆర్.డి.ఒ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర – గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్.ఎస్.టి.ఎల్ డి.ఆర్.డి.ఓలో 55వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ హాజరై మాట్లాడుతూ 1960 ఆగస్టు 20న ఆంధ్రా యూనివర్సిటీలో 10 మంది సిబ్బందితో ప్రారంభం ఆయిన ఈ సంస్థ ప్రస్తుతం 186 మంది శాస్త్రేత్తలు, 603 మంది సిబ్బందితో భారత దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. ప్రాజెక్టలను సకాలంలో పూర్తి చేయడానికి ఎన్ఎస్‌టిఎల్ ఇండియన్ నేవీని దగ్గరుండి సమన్వయం చేస్తోందని, రాబోయే ప్రాజెక్టుల కోసం ఇండియన్ నేవీ ఆసక్తిగా ఎదురుచూస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, శాస్త్రవేత్తలు, అధికారులు వర్క్స్ కమిటీ సెక్రటరి బాల్మికి పండిట్, ఎన్ఎస్‌టిఎల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ అలోక్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: ఫిషింగ్ హార్బర్ సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని, దానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉదయం ఆయన ఫిషింగ్ హార్బర్, చేపల మార్కెట్‌లను సందర్శించారు. స్థానిక నాయకులు, బోటు యజమానులతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్య, కొత్త మార్కెట్ ఏర్పాటు, చేపల స్టోరేజ్, సీసీ కెమెరాలు, మంచి నీటి సౌకర్యం, సెక్యూరిటీ, పారిశుధ్యం మొదలైన సమస్యల గురించి చర్చించారు. దీనికి అవసరమైన నిధులు కేటాయిస్తామని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో హార్బర్‌ను పూర్తిగా ఆధునీకరిస్తామని తెలిపారు. అంతకుముందు గంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మత్స్యకార మహిళలు ఎమ్మెల్యే వంశీకి హారతి పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకార పెద్దలు, కూటమి శ్రేణులు, ఫిషరీస్ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించండి మహాప్రభో.....

నిత్యం నరకయాతన, ఎండలో నిరీక్షణ

విశాలాంధ్ర – ఆనందపురం: ప్రయాణికులకు బస్ షెల్టర్ ఏర్పాటు చేయవలసిన బాధ్యత ఆర్టీసీ యాజమన్యంపై ఉంది. కానీ ఇక్కడ అలా కాకుండా ప్రయాణికుల సమస్యలు యాజమాన్యం గాలికి వదిలేసింది. వివరాల్లోకి వెళితే వేములవలస జంక్షన్ నేషనల్ హైవే నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులే, సుదూర ప్రాంతాలకు వెళ్ళేవారు బస్ స్టాప్ వద్ద నిరీక్షించాలి. వర్షాకాలం, ఎండాకాలం,లో ఇక్కడ ప్రయాణికులు అయితే తరచూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న పాటి బస్టాప్ కూడా ఏర్పాటు చేయని వైనం. దానికితోడు బస్ స్టాప్‌లో ఆర్టీసీ బస్సులు సమయం వేళలు పట్టిక ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ఏ సమయంలో బస్సులు అందుబాటులో ఉంటాయో తెలిపే విధంగా బోర్డు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు అందుబాటులో ఉంచాలని అలాగే వెంటనే బస్ స్టాప్ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు చూడాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

కాలుష్యరహిత ఇంధనంగా హైడ్రోజన్

విశాలాంధ్ర – మధురవాడ: కర్బన ఉద్గారాలను తగ్గించి కాలుష్య రహిత సమాజం ఏర్పడాలంటే ప్రత్యామ్నాయ ఇంధన వనరుల హైడ్రోజన్‌ను పరిగణించాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బిఎస్‌సిఇ సంయుక్తంగా నిర్వహిస్తున్న సింథటిక్ ఫ్యూయల్స్ రెండు రోజుల అంతర్జాతీయ సమావేశాలలో రెండవ రోజైన మంగళవారం నిపుణులు అభిప్రాయ పడ్డారు. భారత్, అమెరికా సహ వివిధ దేశాల నుంచి సమావేశాలలో పాల్గొన్న శాస్త్రవేత్తలు అణు విద్యుత్తుతో పాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవలసిన అవసరాన్ని, అందుకు గల మార్గాలను తమ ప్రసం గాలలో వివరించారు. ఎన్‌టిపిసి నిపుణుడు రిత్విక్ ఘోష్ మాట్లాడుతూ అణువిద్యుత్తు ఉత్పాదనతో పాటు న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లలో విడుదల అయ్యే నీటి ఆవిరి నుంచి కూడా హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చునని తెలిపారు. స్టీల్ పరిశ్రమతోపాటు షిప్పింగ్, ఏవియేషన్, రవాణా, ఎరువుల కర్మాగారాలలో హైడ్రోజన్ ఇంధనానికి డిమాండ్ ఉందని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ఉన్న వివిధ చమురు కంపెనీల ఎల్‌పిజి పైపు లైన్ల ద్వారా హైడ్రోజన్ ఇంధనాన్ని సమాంతరంగా అవసరమైన ప్రాంతాలకు రవాణ చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. సమావేశాల ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విటి ఇండియా న్యూక్లియర్ ఎనర్జీ పాట్నర్‌షిప్ డైరెక్టర్ ప్రొఫెసర్ మైనేని గణపతి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ విఎస్ఆర్‌కె. ప్రసాద్, ఎల్ అండ్ టి సంస్థ ముంబై అధికారి టి.వెంకటేష్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

విశాలాంధ్ర – పెందుర్తి: తన చివరి ఊపిరి ఉన్నంత వరకు దేశం కోసం అవిశ్రాంతంగా శ్రమించిన ధీరుడు, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ, పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆదారి రమేష్ నాయుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుమ్మోజు లక్ష్మోజి తదితరులు కొనియాడారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పెందుర్తి కూడలిలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే చిన్నముసిడివాడలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు విన్నకోట రాము ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ఆర్ నాయుడు, ముక్క రాము నాయుడు, కే.వరప్రసాద్, ఎం.వి.పాత్రుడు, ఎండి. అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్: స్వర్గీయ రాజీవ్ గాంధీ భారతదేశాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలిపారని విశాఖపట్నం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని బీచ్ రోడ్‌లోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సేవాదళ్ సెక్రటరీ బమ్మిడి గంగాధర్, ఎపిసిసి జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కెవి.సూర్యనారాయణ, సోడదాసు సుధాకర్, జిల్లా ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ కస్తూరి వెంకటరావు, జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకుడు పాసర్ల ప్రసాద్, మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు భాషా, వెంకటేష్, త్రినాధరావు, 28వ వార్డ్ అధ్యక్షులు గుర్రం కనకరాజు, యూత్ కాంగ్రెస్ సతీష్, శివ, వల్లయ్య పాల్గొన్నారు.

ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌పై అధికారులతో సమీక్ష

విశాలాంధ్ర – విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఐఎస్‌ఓ మేనేజ్మెంట్ రివ్యూ మీటింగ్ మంగళవారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించారు. ఈ నెలాఖరుకు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌కు సంబంధించిన పర్యవేక్షణ బృందం ఏయూను సందర్శించనుంది. ఇప్పటికే ఏయూలో దీనికి సంబంధించిన ఇంటర్నల్ ఆడిట్‌ను సమర్థవంతంగా పూర్తిచేశారు. రీ సర్టిఫికేషన్‌కు అవసరమైన ప్రక్రియ, తదితర అంశాలపై విభాగాధిపతులు, బిఓఎస్ చైర్మన్లు, విభాగ ఆచార్యులతో వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ప్రత్యేకంగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. తరగతులు సక్రమంగా నిర్వహించాలని, ఫ్యాకల్టీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఇటీవల విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్లో మెరుగైన ర్యాంకులను సాధించడం జరిగిందని ఆచార్యులకు వివరించారు. పెర్సప్షన్ విభాగంలో ఏయూ కాస్త వెనుకబడిందని, దీనిని మరింత పెంపొందించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం ఐక్యూఏసి సమన్వయకర్త ఆచార్య జి.గిరిజా శంకర్ ప్రసంగించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వుడా పార్కును పరిశీలించిన ఎంసీ

విశాలాంధ్ర – విశాఖ: వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం వుడా పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఫేజ్ -2లో ఉన్న స్కేటింగ్ రింక్ చుట్టూ తుప్పు పట్టిన హ్యాండ్ రైలింగ్స్‌ను తక్షణమే మార్చాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గ్యాప్స్ ఉన్న చోట పచ్చదనం పెంపొందించాలని, బీచ్ సైడ్ ఉన్న కాంపౌండ్ వాల్ మీద తుప్పు పట్టిన గ్రిల్స్ స్థానంలో ఇటుక గోడ నిర్మించాలని, ఫేజ్ -1 పిల్లల ఆటల ప్రాంగణంలో ఉన్న పాడైపోయిన ఇపిడిఎం రబ్బర్ ఫ్లోరింగ్ టైల్స్ ను వెంటనే మార్చాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ ఎస్ఈ ఎం.బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్‌విఎస్ఎన్ రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ సుధీర్, మురళీకృష్ణ, సహాయ ఇంజనీర్ హసీనా బేగం, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భగ్గుమన్న భానుడు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: అకాల ఎండలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తు న్నాయి. ఎండా కాలం ముగిసి రుతుపవనాలు రాష్ట్రమంతటా వ్యాపించి అడపా దడపా వర్షాలు కూడా పడ్డాయి. వానాకాలంలో వచ్చింది వాతావరణం మారుతుంది అనుకునేలోపే మళ్ళీ ఎండ తీవ్రత పెరిగింది. అప్పుడప్పుడు అల్పపీడనం ఏర్పడినప్పుడు తేలికపాటి జల్లులు

పడుతున్నాయి. ఇటీవల ఏర్పడ్డ ఊపిరితల ఆవర్తనం వల్ల ఆదివారం వర్షం పడి వాతావరణం చల్లబడినప్పటికీ సోమవారం నుంచి మళ్లీ ఎండలు మొదలయ్యాయి. మంగళవారం ఎండ తీవ్రత బాగా పెరిగింది. రోడ్డు ఎక్కితేనే సూరీడు సూర్రుమనిపిస్తున్నాడు. రోడ్డు ఎక్కేందుకు జనం వెనకడుగు వేశారు. మధ్యాహ్నానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండా కాలాన్ని తలదన్నేలా భానుడు భగ్గుమని సెగలు పుట్టిస్తుండడంతో జనం బెంబేలెత్తు పోతున్నారు. పగటి ఉష్ణోగ్రత పెరగడంతో అధిక వేడి, ఉక్కపోతతో జనం అల్లాడు తున్నారు. ఇళ్లల్లో ఏసీలు వినియోగిస్తే తప్ప ఉండలేని పరిస్థితి. ఎండ తీవ్రత ఎప్పుడు తగ్గుతుందో వాతావరణం ఎప్పుడు చల్లబడుతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

27న జోన్-1 భీమిలిలో బహిరంగ వేలం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్ -1 (భీమిలి)లో ఖాళీగా ఉన్న దుకాణాలకు, రోడ్డు మార్జిన్, మార్కెట్లకు ఈనెల 27వ తేదీ ఉదయం 11.00 గంటలకు జోన్-1 (భీమిలి) కార్యాలయము నందు బహిరంగ వేలం నిర్వహించబడునని 1వ జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలియజేశారు. వార్డ్ నెంబర్ 3 భీమిలి రోడ్డు జి ం1 దుకాణం, పెద్ద బజార్ మీసేవ మేడ పైన గల దుకాణంలో 3 సంవత్సరాల కాల పరిమితికి, భీమునిపట్నం రోడ్డు మార్జిన్, లాల్ బహుదూర్ శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్ నందు ఆశీల్లకు ఇచ్చిన తేదీ నుండి 31-03-2025 వరకు గుత్తకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించబడునని తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు గాని, సంస్థలు గాని ఈ బహిరంగ వేలం లో పాల్గొనవలసినదిగా కోరడమైనదని తెలిపారు. పూర్తి వివరాలకు జోన్-1, భీమిలి కార్యాలయ పని దినాలలో సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలిపారు.

చంద్రబాబుపై ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదు

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, అతనిపై ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ హెచ్చరించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు చంద్రబాబు నాయుడు స్టిక్కర్లు అతికిస్తున్నారని గుడివాడ అమర్నాద్ చేసిన వ్యాఖ్యలపై తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ స్పందించారు. మంగళవారం జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏం చేసిందో తనతో చర్చకు రావాలని గతంలోనే పిలుపు నిచ్చానన్నారు. ఆ చర్చలకు మొహం చాటేసిన గుడివాడ అమర్ ఇప్పుడు ప్రగల్భాలు పలకడం సరికాదన్నారు. ఉన్న పరిశ్రమలను పక్క రాష్ట్రాలకు పంపించిన ఘనత వైయస్సార్ ప్రభుత్వానికి చెందుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే గొప్ప చరిత్ర నారా చంద్రబాబునాయుడుదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ బొడ్డేపల్లి రఘు, కందుల నాగరాజు, డాక్టర్ పప్పూర్ నికుంజ్, ఎస్.ఎల్లాజీరావు, వి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక విధానంపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నేడు ధర్నా

విశాలాంధ్ర – పెందుర్తి: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానంపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం చిన ముసిడివాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు నాయకులు ఆర్.శ్రీనివాసరావు, వై.రాంబాబు తెలిపారు. నూతన ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆవేదన వెలిబుచ్చారు. బడాబాబులు ఇసుకను దోచుకుంటున్నారని దీనిపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వెల్లంకిలో కాలుష్యంపై జనవిజ్ఞాన వేదిక బృందం పరిశీలన

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలో వెల్లంకి గ్రామపంచాయతీలో పరిశ్రమల ద్వారా వెలువడిన కాలుష్యాన్ని మంగళవారం జన విజ్ఞాన వేదిక బృందం పరిశీలించి వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలుసుకొని కాలుష్యంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం స్ప్రింట్ ఎక్స్పోర్ట్ కంపెనీ సందర్శించారు. కంపెనీలో వాటర్ పొల్యూషన్ ఏ విధంగా ఉందో పరిశీలించిన బృందానికి కంపెనీ సిబ్బంది నిరాకరించడంతో వెనుతిరిగారు. అనంతరం కంపెనీ నుండి బయటకు విడిచిపెట్టిన నీటి కాలుష్యాన్ని పరిశీలించారు. ఎవర్గ్రీన్ ప్లైవుడ్ కంపెనీ నుండి వెలువడే కాలుష్యంపై తీసుకుంటున్న జాగ్రత్తగా గురించి కంపెనీ మేనేజర్ బిస్వాల్‌తో పలు విషయాలు మీద చర్చించారు. ఈ సందర్భంగా వెల్లంకి గ్రామ ఉపసర్పంచ్ కంచరాపు శ్రీను, ఎంపిటిసి సభ్యులు పడాల రాము గ్రామంలో కాలుష్యంపై పలు విషయాలను జనవిజ్ఞాన వేదిక సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ రమేష్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్ వి కె వరశురాం, జన విజ్ఞాన వేదిక పర్యావరణ పరిరక్షణ జిల్లా కన్వీనర్ డాక్టర్ లక్ష్మణస్వామి పాలూరు ఆధ్వర్యంలో పర్యావరణ కమిటీ సభ్యులు సూరెడ్డి బాబురావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యావిగేటింగ్ లా స్కూల్ అండ్ ది లీగల్ ప్రొఫెషన్‌పై చర్చ

విశాలాంధ్ర – పెందుర్తి: దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వ విద్యాలయంలో "న్యావిగేటింగ్ లా స్కూల్ అండ్ ది లీగల్ ప్రొఫెషన్" అనే అంశం మీద జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి ప్రత్యేక ఉపన్యాసాన్ని అందించారు. ఈ కార్యక్రమము విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రో. డి.సూర్య ప్రకాశరావు స్వాగత ఉపన్యాసంచే ప్రారంభమైంది. ప్రత్యేక ఉపన్యాసం అందిస్తూ జస్టిస్ మహేశ్వరి తన ప్రసంగంలో, న్యాయ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు సందర్శించడానికి తన ఆసక్తిని గురించి మాట్లాడుతూ ఈ సంస్థలు భవిష్యత్ న్యాయవాదులు, న్యాయనిపుణులను తయారు చేయడం ద్వారా న్యాయ విద్యను కాలానుగుణ మార్పులకు అనుగుణంగా న్యాయవాదులను తయారు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉపన్యాసం కంటే తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకునేదుకు ఇష్టపడ్డారు. న్యాయ వాదిగా తన 20 సంవత్సరాల అనుభవాన్ని, న్యాయమూర్తిగా 10 సంవత్సరాల అనుభవాన్ని ప్రతిభించేలా మాట్లాడుతూ తన జీవితంలో ఏ ఒక్క దశలోను న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ప్రవర్తించలేదని తెలుపుతూ, న్యాయ వద వృత్తిలో ముఖ్యంగా కావలసింది ఓపిక అని, ఎంత ఓపికగా ప్రయత్నిస్తే అంత ఎక్కువ శాతం విజయం సాధించవచ్చని తెలిపారు. "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా ఎదిగిన డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఉదాహరణను ఉటంకిస్తూ డిఫెన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంలో విఫలమైనప్పటికీ, ఆయన తన కృషి కొనసాగించి తాను ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవడమే కాకుండా, నేటి, భావితరాలకు ఆదర్శంగా నిలిచారని, అందుచేత విద్యార్థులు నిరుత్సాహంను దరిచేరకుండా తమ లక్ష్య సాధన లో ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా భారతదేశ మాజీ ప్రధాన న్యాయమూర్తి రమేష్ చంద్ర లహోటి ని గురించి మాట్లాడుతూ అయన తనకు గురువు లాంటివారని ఆయన నుండి నుండి న్యాయపరమైన సాంకేతికతలను అనేక వాటిని నేర్చుకోవడమే మాత్రమే కాకుండా వృత్తిపరమైన నీతి

మరియు వినయాన్ని కూడా నేర్చుకున్నానని అన్నారు. విద్యారులు సహనం, పట్టుదల, పెద్దల పట్ల, ఉపాధ్యాయుల పట్ల గౌరవం అలవరచుకోవాలని ఏది నేర్చుకోవడం లో ఉన్న ముఖ్య లక్షణమన్నారు. ప్రతి విద్యార్థి తన బలము మరియు బలహీనతల గురించి, బలహీనతలను అధిగమించేందుకు ఎప్పుడూ రాజీపడకుండా, సహనం, పట్టుదల కలిగి ముందుకు సాగాలని ఉద్బోధించారు. ఈ అంశాలను వివరించడానికి, ఆయన రామ్ జెఠ్మలానీ, ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద, సర్దార్ వల్లభాయ్ పటేల్ ల జీవితం ని కొన్ని సంఘటనలు ఉదహరిస్తూ వారి జీవితం ఎంత ఆదర్శప్రాయమో తెలిపారు. న్యాయవాద వృత్తి యొక్క సమగ్రతను కాపాడుకోవడంలో శ్రమకు ప్రత్యామ్నాయం లేదని తెలుపుతూ ముగించారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో మేధో హక్కుల సెంటర్ కు భారత ప్రభుత్వంచే మంజూరు చేయబడిన ఐపీఆర్ చైర్‌ను గౌరవ న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా. నందిని సిపి, దయానంద మూర్తి, అకాడమిక్ డైరెక్టర్ సోమా భట్టాచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కండ్లకలక పట్ల అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు

విశాలాంధ్ర – విశాఖపట్నం: కండ్లకలకలపై అవగాహన పెంచుకొని ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని ఎల్వీపీఈఐ నేత్ర వైద్యులు డాక్టర్ హిమబిందు సూచించారు. ఈ మేరకు మంగళవారం విశాఖలోని ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ జీఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణంలో జరిగిన వైద్య సదస్సులో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ హేమ విందు వివరాలు తెలిపారు. కండ్లకలక సంభవించుటకు వైరస్‌లు, బ్యాక్టీరియా అలర్జీలు అనేవి ప్రధాన కారణం అని, కండ్లకలకను సాధారణంగా "పింక్ ఐ " (గులాబీ కన్ను) అని పిలుస్తారన్నారు. కండ్లకలక వాపు లేదా ఇన్ఫెక్షన్, కనురెప్పను లైన్ చేస్తుందన్నారు. కనుగుడ్డు యొక్క తెల్లని భాగాన్ని కప్పివేస్తుందని, కండ్లకలక అనేది ఒక అంటువ్యాధి అని చెప్పారు. ఈ వ్యాధి లక్షణాలను అనుసరించి చికిత్సా విధానం ఉంటుందన్నారు. కండ్లకలక వ్యాధిని నివారించుటకు త్వరితంగా కోలుకోనుటకు ఈ చికిత్స తోడ్పడుతుందన్నారు.

28న 5వ జోన్‌లో బహిరంగ వేలం ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ, జ్ఞానాపురం, జోన్–5, పరిధిలో గల వార్డు నెం 40 నుండి 63 వరకు సంబంధించిన ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపములు, రోడ్డు సైడ్ మార్కెట్లకు ఈనెల 28వ తేదీ ఉదయం 11.00 లకు 5 వ జోనల్ కార్యాలయము, జ్ఞానాపురం నందు దిగువ తెలిపిన వివరాలు వారిగా బహిరంగ వేలము నిర్వహించబడునని జోనల్ కమీషనరు ఆర్.జి.వి.క్రిష్ణ శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

వార్డు నెం.60 గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం. 8,15,22,24,25,41,46, 48,52,54,55,56,57 మరియు 58, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణము నెం.1, 2, అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణము నెం.02, త్రినాధపురం షాపింగ్ కాంప్లెక్స్ దుకాణము నెం.01, బాపూజీ నగర్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణము నెం.01,02,03,04 మరియు 05 షాప్ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు మరియు కళ్యాణ మండపాలు వార్డు నెం 51 (కొత్త వార్డు) లోని మాధవ స్వామి కళ్యాణ మండపం మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు మరియు మార్కెట్స్ లలో గుల్లలపాలెం దుకాణము రోడ్ పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి రోడ్ సైడ్ మార్కెట్, జనతా కాలనీ (బుధవారం) వారం మార్కెట్, కంచరపాలెం రోడ్ సైడ్ మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్ సైడ్ మార్కెట్, అక్కయ్యపాలెం రోడ్ సైడ్ మార్కెట్ లకు ఒక సంవత్సరం కాల పరిమితి వరకు గుత్తకిచ్చుటకు వేలం పాట జరుగును. కావున ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొన వలసిందిగా కోరడమైనదని, తదుపరి పూర్తి వివరాల కొరకు జోన్–5 (జ్ఞానాపురం) కార్యాలయము పని దినములలో పర్యవేక్షకుని సంప్రదించగలరని జోనల్ కమీషనరు తెలియజేసారు.

తారు రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర – పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు కృష్ణరాయపురం నుండి జ్యోతినగర్ వరకు జీవీఎంసీ నిధులు 68.95 లక్షలతో నిర్మాణం జరుగుతున్న తారు రోడ్డు పనులను మంగళ వారం ఉదయం స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యతాపరంగా రాజీలేకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జ్యోతినగర్ చివర్లో 300 అడుగులు రోడ్డు నిర్మాణానికి యూజీడీ పనుల వలన అంతరాయం కలిగిందని తెలిపారు. యూజీడి పనులు పూర్తి అయిన తరువాత అక్కడ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వేపాడ శ్రీను, దలాయి శ్రీను, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర – విశాఖ సిటీ: సాగర తీరంలో బుధవారం సాయంత్రం నుంచి ఉపకార ట్రస్ట్, విశాఖ జిల్లా చిరంజీవి యువత ఆధ్వరంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నారు. ఈ వేడుకల పోస్టర్‌ను జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు శక్తి అధ్యక్షుడు బీ.వీ.రామ్, జనసేన వైద్య విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి రఘు, కార్పొరేటర్ కందుల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి అంచలంచెలుగా ఎదిగి అశేషమైన అభిమానులను సంపాదించు కున్నారన్నారు. చిరంజీవి పుట్టిన రోజు ఒక వేడుకలా కొనసాగుతుందన్నారు. ఎస్.ఎల్లాజీ రావు, అధ్యక్షులు చిరంజీవి యువత విశాఖ జిల్లా మాట్లాడుతూ ఈ ఏడాది బీచ్ రోడ్డులో అత్యంత ఘనంగా వేడుక నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఈ వేడుకలకు ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పంచకర్ల రమేష్, వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజుతో పాటు పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల నాయకులు, అభిమానులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దోమల నియంత్రణపై

జీవీఎంసీ అవగాహన కార్యక్రమాలు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గునియా మొదలైన వ్యాధులకు కారణమైన దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని జివిఎంసి బయాలజిస్ట్ సాంబమూర్తి పేర్కొన్నారు. మంగళవారం జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం నుండి పాత జైల్ రోడ్డు, తదితర ప్రాంతాలలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీని నిర్వహించడమైనదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ బయాలజిస్ట్ మాట్లాడుతూ ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. దోమల వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడువాపు మొదలైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వీటిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టడం జరిగిందని, ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ కొబ్బరిబండాలు, టైర్లు, సీసాలు, ఫ్రిజ్ వెనుక భాగంలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని, అలాగే నీటితొట్టి, పూల కుండీలో నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేశామన్నారు. దోమల నియంత్రణకు కాలువలు శుభ్ర చేయడం, ఫాగింగ్, స్ప్రేయింగు వంటి కార్యక్రమాలు నిత్యం జీవీఎంసీ మలేరియా విభాగం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి, జిల్లా మలేరియా సిబ్బంది, జివిఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక అధికారులపై

క్రమశిక్షణ చర్యలకు సిఫారసు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా కోటవురట్లలో గల పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ సారధ్యంలో గల ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని కెజీహెచ్ పిడియాట్రిక్స్ వార్డులో చికిత్స పొందుతున్న దాదాపు 42 మంది బాలలను, వారి తల్లిదండ్రులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మంగళవారం ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్య సదుపాయాలుపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తిల నుండి అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదిక చికిత్సలతో పాటు మరింత మెరుగైన వైద్యం కోసం మరో ముగ్గురు పిల్లలను నగరంలోని ఇతర ఆసుపత్రుల్లో చికిత్సకు చేర్చినట్టు వైద్యులు వివరించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ 13 ఏళ్ల నుండి ఎటువంటి అధికారిక పత్రాలు లేకుండా ఈ సంస్థ నడపబడినట్టు పత్రికల్లో వచ్చిన వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. ఇటువంటి అనధికార సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని ఉన్నాయో సమాచారం సేకరించేందుకు 26 జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఎస్పీలతో పాటు ఉన్నతాధికారులకు లేఖలు వ్రాసినట్లు తెలిపారు. బాలల అభివృద్ధికి, వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు మమేకమయ్యే స్థానికంగా ఉండే వివిధ శాఖల అధికారులతోపాటు, జిల్లా అధికారుల దృష్టి ఇటువంటి సంస్థలపై కేంద్రీకరించి అనుమతులు జారీ చేసి ఉంటే ఇటువంటి మరణ ఘంటికలు మ్రోగి ఉండేవి కాదని అన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కోటవురట్ల స్థానిక అధికారులపై క్రమ శిక్షణా చర్యలు చేపట్టేలా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సారధ్యాన తమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్లు తెలిపారు. పిల్లలను పరామర్శించిన వారిలో ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యులు లక్ష్మీ, ఎం.రజని, సూర్యనారాయణ, విజయలక్ష్మి, సి.డి.పి.ఓ. శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, పి.వో. ఐ.సి.రమేష్, కె.జి.హెచ్ ఒన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య తదితరులున్నారు.

అనధికార ఆశ్రమాలు, హాస్టల్స్‌పై నిఘా పెట్టాలి

కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు

విశాలాంధ్ర – పెందుర్తి: విషాహారం తిని కె జి హెచ్ లో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు మంగళవారం పరామర్శించారు. బాధితెలుసుకున్నారత కుటుంబీకులు వైద్యులతో మాట్లాడి పిల్లల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న విద్యార్థులను చూస్తే వ్యవస్థల మీద నమ్మకం నశిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దైవానికి స్వరూపాలైన డాక్టర్లు,నర్సులు చాలా నిబద్ధతతో పిల్లలకు చికిత్స చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ సంస్థలు నడుపుతున్న ఆశ్రమాలు, హాస్టల్ నిర్వహణపై ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పెళ్లిల్లు, ఇతర వినోద కార్యక్రమాలలో మిగులు ఆహారాన్ని స్వచ్ఛంద సంస్థలు లేదా అనాధ శరణాలయాలకు అందించే పద్ధతిని పూర్తిగా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై రాష్ట్రంలో ఉన్న అన్ని ఫంక్షన్ హాల్ లకు బహిరంగ నోటీసు జారీ చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నియోజకవర్గం స్థాయిలో అధికారిని నియమించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విశాఖపట్నంలో పోలీస్, పబ్లిక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాపా హెూం సంస్థ ఇటువంటి ఆహార నియమాలపై చాలా నిబద్ధతగా వ్యవహరిస్తారని, ముఖ్యమంత్రి తక్షణమే ప్రైవేట్ సంస్థల తరపున నిర్వహిస్తున్నటువంటి హాస్టల్లో అనాధ శరణాలయాలపై తనిఖీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని మూల వెంకట్రావు కోరారు. ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి తక్షణమే విశాఖపట్నం వచ్చి పిల్లలకు,వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కింగ్ జార్జి ఆసుపత్రిలో వృక్షాబంధన్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: కేజీహెచ్‌లో మినిస్టీరియల్, నర్సింగ్ మరియు ఇతర ఉద్యోగులు, క్లైమేట్ ఫ్రంట్ విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో చెట్లకు రాఖీలు కట్టి వృక్షాబంధనం కార్యక్రమం నిర్వహించారు. రాఖీ పౌర్ణమి రోజున సోదర, సోదరీమణులు పరస్పర సహకరం రక్షణ, ఆత్మీయతలకు ప్రత్యేకంగా జరుపుకుంటున్నట్లు, మానవాళికి మహత్తరమైన సేవలు అందిస్తూ మేలు చేస్తున్న చెట్లకు వాటి రక్షణ భారం మాదే అనే భావానికి సంకేతంగా వృక్షాలకు రాఖీ కట్టి తమ ఆత్మీయతను తెలియజేస్తున్నామని కెజిహెచ్ అసిస్టెంట్ డైరక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలియజేసారు. ఇటువంటి మంచి కార్యక్రమాం చేపట్టిన సిబ్బంది పట్ల సూపరింటెండెంట్ డా.శివానంద హర్షం వ్యక్తం చేసారు. తొలుత గైనిక్ విభాగానికి ముందు ఉన్న భారీ వృక్షానికి రాఖీ కట్టి SAVE TREE, SAVE LIFE అనే నినాదాన్ని చేసారు. మరికొన్ని చెట్లకు రాఖీలు కట్టి చివరిగా పునరుజ్జీవింబడలిన బాదం చెట్టుకు వృక్షాభందన కట్టారు.

ఇటీవలే రెండు నెలలు క్రితం నేలకొరిగిన 20 అడుగుల చెట్టును తిరిగి వేరొక చోట నాటిన న్యూట్రిషన్. ఫంగల్ ట్రీట్మెంట్ చేస్తూ మినిస్టీరియల్ సిబ్బంది, శ్రీనివాస్ కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇది ప్రతీ ఒక్కరికీ ఒక సందేశంగా చెట్లు నరకవద్దు, చెట్లను నాటండి, చెట్లను పునరుజ్జింప చేయండి అనే సందేశం ఇచ్చినట్లవుతుందని క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి భట్టాచార్య తెలిపారు. 2023 నుండి (గత సంవత్సరం), రాఖీ పౌర్ణమికి మరుసటి రోజు వృక్షాభందనం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. పునురుజ్జీవింపబడిన చెట్లు కూడా తిరిగి చిగురించి వాటికి జీవితాన్ని పునర్మించుకోవడం ఎంతో సంతోషకరమని ఈ సంప్రాదాయన్ని విశేశంగా ముందుకు తీసుకువెళ్ళాలని పలువురు డాక్టర్లు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో 3 జి హెచ్ అసిస్టెంట్ డైరక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ కుమార్, మేనేజర్ పి.యమ్.జవహర్లాల్, జయప్రకాష్, అయింద్రిల్లా, వాణి, విజయ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.